


## రెవిన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం సస్పెండ్ చేస్తానంటు హెచ్చరిక



**బుచ్చి జనవరి 2 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరినారాయణ రెవిన్యూ అధికారులపై అగ్రహాం వ్యక్తం చేశారు. ఎక్కువ మంది ప్రజలు రెవిన్యూ సమస్యలపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని రావడంతో ఆయన మొదట విఆర్ఓ పార్థసారదిని ప్రశ్నించారు. అలాగే తహసిల్దారుని ప్రశ్నించారు. సమస్యలు ఎందుకు పరిష్కారం చేయలేదంటు విఆర్ఓని ప్రశ్నించగా ఆయన సంతృప్తికరంగా సమాధానం చెప్పకపోవడంతో సస్పెండ్ చేస్తానంటు ఆగ్రహాం వ్యక్తం చేశారు. సమస్యలు అడిగిన వారికి పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. అనంతరం ఎంపిటిసి సభ్యులు వినయ్‌నారాయణ యూరియా కొరత ఎక్కువగా ఉందని, పెర్టిలైజర్స్ దుకాణా దారులు యూరియా కావాలంటే దుక్కిపిండి తీసుకోవాలని చెబుతున్నారని చెప్పడంతో అగ్రికల్చర్ అధికారులతో మాట్లాడతానిని సమస్య పరిష్కారం చేస్తానని హామి ఇచ్చారు. గ్రామ సర్పంచ్ ఓడా పెంచలయ్య మాట్లాడుతు గ్రామంలో రెవిన్యూ సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. సాక్షాత్తు ఎమ్మెల్యే సమస్యలు పరిష్కరించమని రెవిన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏదిఏమైనప్పటికి రెవిన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహాం వ్యక్తం చేసి సస్పెండ్ చేస్తానని హెచ్చరించడం హాట్‌టాపిక్‌గా మారింది.

## జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలు ఉపయోగించుకోండి



**బిట్రగుంట, జనవరి 2 ప్రభాతవార్త** జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలు ఉపయోగించుకోవాలని స్టేట్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పద్మావతి కోరారు. బోగోలు మండలం బోగోలు 3వ సచివాలయ పరిధిలోని హోలీ ఫ్యామిలీ స్కూలులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పద్మావతి తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రతి కౌంటర్‌ను పరిశీలించారు. నిపుణులైన వైద్యులతో, వైద్య శిబిరంలో వున్న డాక్టర్లతో మాట్లాడి ఎంతమంది ఓపి వచ్చారు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న మందులను కూడా పరిశీలించారు. అన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఖర్చు పెట్టి ప్రజలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు, డిప్యూటీ డియంఅండ్‌హెచ్‌వో బ్రిజిత, కోవూరుపల్లి డాక్టర్లు జిహారిక, నిత్య, సిడిపివో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆర్థిక సమస్యలతో కుటుంబ సభ్యులు ఆత్మహత్యాయత్నం

**కావలి రూరల్, జనవరి 2 ప్రభాతవార్త** కావలి తుఫాన్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ ఎండ్లూరి భాస్కర్ కుటుంబం ఆర్థిక సమస్యలతో ఆత్మాయత్నానికి పాల్పడ్డారు. బిర్యానీలో గుళికలు కలుపుకొని ఎండ్లూరి భాస్కర్, ఆయన భార్య చిన్నమ్మ, కుమారుడు అవినాష్, కుమార్తె దీపికలు తిన్నారు. దీన్ని చుట్టుపక్కల వారు గమనించడంతో 108కు సమాచారం అందించడంతో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కమిషనర్ వికాస్ మర్మత్

**నెల్లూరు కార్పొరేషన్, జనవరి2, ప్రభాతవార్త** నెల్లూరునగరపాలక సంస్థ పరిధిలోని సిటీ నియోజకవర్గంకు సంబంధించిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలను కమిషనర్ వికాస్‌మర్మత్ మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక మూలాపేటలోని ఈ. ఎస్. ఆర్. ఎమ్ పాఠశాల, సంస్కృత పాఠశాల, బాలికల పాఠశాల, సంతపేటలోని డి. ఎమ్. హెచ్. ఓ కార్యాలయం, మోడల్ హైస్కూల్, జాకీర్ హుస్సేన్ నగర్ మున్సిపల్ పాఠశాలలతోపాటు ఇతర పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా జరిగేలా కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించాలని ఎన్నికల విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఓటర్లందరూ తమ ఓటుహక్కును వినియోగంచుకునేందుకు అసవరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచినిటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ ప్రక్రియ ప్రణాళికా బద్ధంగా జరిగేలా కేంద్రాలలో అన్ని వసతులను కల్పించాలని ఎన్నికల విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఓటర్లందరూ తమ ఓటుహక్కును వినియోగంచుకునేందుకు అవసర మైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచినీటి సదుపాయాలు, పారిశుద్య నిర్వహణ, మార్గ నిర్దేశిక సూచికలు, విద్యుత్ సదుపాయం, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక వీల్ చైర్లు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా రక్షణ ఏర్పాట్లు, తదితర మౌళిక వసతులను అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసేలా పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఏ. ఈ. ఆర్. ఓ. లు, సూపర్‌వైజర్లు, బూత్‌లెవల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## భీమవరం హత్యల కేసులో ముగ్గురు నిందితులు అరెస్ట్



**మర్రిపాడు, జనవరి2, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలో తీవ్ర సంచలనం కలిగించిన భీమవరం భూ తగాదా గురించి రెండు హత్యకేసులోకీలకమైన ముగ్గురు నిందితులను మంగళవారం ఆత్మకూరు సిఐ వేణు సారధ్యంలో అరెస్ట్ చేశారు. ఆత్మకూరు సర్కిల్ కార్యాలయంలో డియస్పీ ఎన్. కోటారెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వివరాలను వెల్లడించారు. భీమవరం వడ్డిపాళెంకు చెందిన మందా రామరత్నారెడ్డి, మందా రఘురామిరెడ్డిలకు పొలానికి సంబంధించిన వివాదం కొంత కాలంగా నడుస్తుందన్నారు. ఈనేపథ్యంలో మందా రామరత్నారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మర్రిపాడు రెవెన్యూ అధికారుల బృందం డిసెంబర్ 28వ తేదీ పొలం వద్ద అర్జీ విషయమై మాట్లాడుతుండగా పక్కనే ఉన్న మందా రఘురామిరెడ్డి , మందా సునీత, మందా లక్ష్మి లు రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో వాదోపవాదాలకు దిగారు. రామరత్నారెడ్డి ఆయన కుమారులు రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డిలను నిందితులు గుద్ది చంపేందుకు ప్రయత్నించగా దాడిలో రామరత్నారెడ్డి కుమారులు రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డిలు తప్పించుకునే ప్రయత్నం చేయగా రఘురామిరెడ్డి తనట్రాక్టర్‌తో వారి కారును ఢీకొట్టగా అక్కడి నుండి బయటపడి వెళ్ళిపోయారని, వెనువెంటనే పొలంలో ఉన్న రామరత్నారెడ్డిని కెజివీల్స్ ట్రాక్టర్‌తో ఢీకొట్టి ఆయనపైకి ఎక్కించి చంపారని అడ్డువచ్చిన రామరత్నారెడ్డి ట్రాక్టర్ డ్రైవర్ అయిన మూలి శ్రీనివాసులుపై కూడా ట్రాక్టర్‌ను ఎక్కించి హత్యచేసి పారిపోయినట్లుగా తమ విచారణలో వెల్లడైందని డియస్పీ కోటారెడ్డి తెలిపారు. ఎస్పీ కె. తిరుమలేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరుసిఐ జి. వేణు, మర్రిపాడు ఎస్ఐ పి. విశ్వనాధరెడ్డిలు కేసు నమోదు చేసి చేధించారని ఆయన తెలిపారు. ఈహత్యకేసును చేధించడంలో ప్రతిభచూపిన ఆత్మకూరు సిఐ , మర్రిపాడు ఎస్ఐ, సిబ్బంది హెచ్‌సి 2225, 742, పిసి 585, 749, 2533, 2742, డబ్ల్యుపిసి 301, డబ్ల్యుహెచ్‌సి 299లను కోటారెడ్డి అభినందించారు.

## చాగణంలో ఇరువర్గాలు ఘర్షణ.. స్వల్ప గాయాలు

**సైదాపురం, జనవరి 2, ప్రభాతవార్త** చాగణం గ్రామంలోని బావి సమీపంలో ఉన్న అరుంధతియ వాడలో ఒకే కులానికి చెందిన ఇరువురు మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. వివరాల మేరకు.. ఓ ఆటో, కారు విషయంలో ఈ ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో ఇరువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ సందర్భంగా ఎస్సై చల్లా వాసు మాట్లాడుతూ చాగణం గ్రామంలో జరిగిన వివాదంలో ఒకరిపై ఒకరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఆ గ్రామానికి చెందిన మాతంగి చిన్న పెంచలయ్య, వారి అనుచరులు కొందరు అదే విధంగా మందా శంకరయ్య వారి అనుచరులు మరికొందరు తమపై దాడి చేసి కొట్టారంటూ ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడం జరిగిందని, వారి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

# పెంచిన పింఛన్లను పంపిణీ చేసిన మంత్రి కాకాణి



**పొదలకూరు జనవరి 2 ప్రభాతవార్త** పాదయాత్రలో నేటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామిలను నిలబెట్టుకుంటు 3 వేల వరకు పెన్షన్ పెంపుదల చేసి పంపిణి చేస్తున్న ఆయన చిత్తశుద్ది ఏనాయకుడికి ఉండదని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కాకాణిగోవర్ధన్‌రెడ్డి పేర్కున్నారు. పొదలకూరు ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణి కార్యక్రమంలో ఆయన పాల్గోన్నారు. ఈ సందర్బంగా పెంచిన పెన్షన్‌ను నూతనంగా మంజూరు అయిన పెన్షన్‌లను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు ఇచ్చిన మాట ప్రకారం 2 వేల రూపాయాల నుండి విడతల వారిగా 3 వేలకు పెన్షన్ పెంచి అర్హులైన ప్రతిఒక్కరికి పెన్షన్ మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సభాముఖంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధిక పెన్షన్ ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి అని మంత్రి కొనియాడారు. గత ప్రభుత్వంలో వెయ్యి రూపాయాలు ఉన్న పెన్షన్ నాటి ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ పెంచుతానని పాదయాత్రలో హామి ఇవ్వడంతో ఉలిక్కిపడ్డ చంద్రబాబు ఎన్నికలకు ముందు రెండు వేల రూపాయాలకు పెంచి రెండు మాసాలు మాత్రమే ఇచ్చి ఓటుల అడుక్కున్నాడని ,కాని గుర్తించిన జనం బుద్దిచెప్పారని ఆనాడు 2 వేలు పెంచడానికి కూడా జగన్‌మోహన్‌రెడ్డే కారణమని తెలుసుకున్న ప్రజలు ఆయనకు పట్టం కట్టారని అన్నారు.

సిఎం జగన్‌హయాంలో అన్ని అభివృద్ధి వసులు, నంక్షేమవథాకాలుశరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గోన్నారు.

# పోలీసు స్పోర్ట్స్ గేమ్స్ మీట్-2023ను ప్రారంభించిన ఎస్పీ



**నెల్లూరు క్రైమ్, జనవరి 2, ప్రభాతవార్త** నిత్య జీవితంలో క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని క్రీడలతో మానసిక ప్రశాంతతో పాటు చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు జిల్లా వార్షిక పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2023ను జిల్లా ఎస్పీ డాక్టర్ కే. తిరుమలేశ్వర్‌రెడ్డి స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. మూడు రోజులు పాటు జరిగే స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ నిత్యం విధుల్లో బిజీగా ఉండే పోలీసు సిబ్బందికి ఆరోగ్యం, సంతోషం, ఉత్సాహం, ఆహ్లాదకరంగా గడిపేందుకు క్రీడలు చాలా దోహదం చేస్తాయన్నారు. గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని, జయపజయాలు అనేవి అనుకూల, ప్రతికూల పరిస్థితులతో ముడిపడి ఉన్నాయని, కానీ క్రీడా స్ఫూర్తితో చివరి వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2023 ఈ రోజు ఘనంగా నిర్వహించడం, అందరూ పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, భాగస్వాములు అవుతున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఎస్పీ క్రికెట్ ఆడి అందరిలోనూ ఉత్తేజాన్ని నింపారు. అందరూ క్రీడా స్ఫూర్తితో వ్యవహరించి రెట్టింపు ఉత్సాహంతో ఈ క్రీడల్లో పాల్గొని, అత్యుత్తమ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. తొలుత ఆయన క్రీడలలో పాల్గొనే 5 సబ్ డివిజన్లు, ఏఆర్, హోంగార్డ్స్, డీపీఓ అధికాఉలు, సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పావురాలను, త్రివ్వ పతాకానికి గుర్తుగా బెలూన్‌లను గాల్లోకి వదిలి స్పోర్ట్స్ టార్చ్‌ను వెలిగించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(క్రైమ్) ప్రసాద్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లాలోని అందరూ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# చెత్త తరలింపు వాహనాలను దయచేసి అడ్డుకోవద్దు



**నెల్లూరుకార్పొరేషన్, జనవరి2, ప్రభాతవార్త** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రైవేటు వాహనాలతో పారి శుద్య నిర్వహణ పనులు చేపడుతున్నామని, చెత్త తరలింపు వాహనాలను కార్మికులు దయచేసి అడ్డుకోవద్దని కమిషనర్ వికాస్‌మర్మత్ అభ్యర్థించారు. స్థానిక పొగతోట, బృందావనం, ట్రంక్‌రోడ్డు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పోలీస్ విభాగం, నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికులు శాంతియుతంగా సమ్మెను నిర్వహించుకోవాలని, చెత్త తరలింపు ప్రైవేటు వాహనాలను అడ్డుకోవడం, రాకపోకలకు ఆటంకం కలిగించడం సరైన విధానం కాదని తెలిపారు. వీధుల్లో వ్యర్ధాలు పేరుకోవడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున, నగర ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైతే కఠిన చర్యలు కూడా తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో నెల్లూరునగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలంతా సహకరించాలని కమిషనర్ కోరారు. ప్రజలంతా గృహ వ్యర్ధాలను వీధుల్లో, రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని, చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు.

## బస్సు యాత్రను విజయవంతం చేయండి



**ముత్తుకూరు, జనవరి2, ప్రభాతవార్త** ఈ నెల 6వ తేదీన జరిగే ప్రజాసాధికారక బస్సుయాత్రను విజయవతం చేయాలని వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రరాష్ట్ర సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోల్లో ఇచ్చిన హామీల్లో అన్ని నిర్వహించుకుంటూ ఏ రాష్ట్రంలో చేయడం విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పరిపాలన ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాలు కూడా ఆయన బాటలోనే పయనిస్తున్నాయన్నారు. గత ఏడాది నవంబర్‌లో జరగాల్సిన ప్రజాసాధికారక బస్సు యాత్ర తుఫాను కారణంగా వాయిదా వేయడం జరిగిందని, 6వ తేదీన బస్టాండ్ సెంటర్లో ప్రజాసాధికారత బస్సు యాత్ర 4గంటలకు రావడం జరుగుతుందని, ఈ బస్సు యాత్రలో స్థానిక ఎమ్మెల్యేలతోపాటు, రాష్ట్ర మంత్రులు, నాయకులు రావడం జరుగుతందని ఈ కార్యక్రమన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని కార్యకర్తలకు తెలిపామన్నారు. అన్ని కులాలను కలుపుకుంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ముందుకెళ్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించి మరళా జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేలా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. ఆంధ్రరాష్ట్రానికి శాశ్వతముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ఉండాలని భగవంతుడిని కోరకుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు పోలిరెడ్డి చిన్నపురెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, వైసీపీ యూత్ మండల అధ్యక్షుడు దువ్వూరు తేజారెడ్డి, సర్పంచ్‌లు ఆలపాక సీనయ్య, ప్రతాప్, లక్ష్మీ, కోఆప్షన్ సభ్యులు జమీల్, మైనార్టీ నాయకులు అగ్ని, గండవరం సూరి, కాటంరెడ్డి వసంతకుమార్‌రెడ్డి, మునుకూరు సుధీర్‌రెడ్డి, తిన్నెలపూడి బ్రహ్మానందం, ప్రభాకర్‌నాయుడు, ఎంపిటిసి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ పోలేరమ్మ ఉత్సవం





**అల్లూరు, జనవరి 2 ప్రభాతవార్త** అల్లూరు గ్రామదేవతలైన శ్రీ గంగమ్మ, శ్రీ కళుగోళమ్మ, శ్రీ పోలేరమ్మ అమ్మవార్ల గ్రామోత్సవాన్ని అల్లూరు ఊరు ఉత్సవ కమిటీ సభ్యులు, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆచార సాంప్రదాయాలు పాటిస్తూ వైభవంగా నిర్వహించారు. అమ్మవారులు సర్వజనులను బిడ్డందు, గొడ్డందు, పాడిపశువులను, పంటలను సదాకాపాడుతూ బాధల నుండి రక్షించి నూతన దంపతులకు దీర్ఘ సుమంగళి తత్వం ప్రసాదించి కలుగజేసే ముగ్గరమ్మల ఉత్సవం ఉదయం వేళ అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాల అనంతరం కుమ్మరి వారి సాంప్రదాయం అఖండ ప్రతిష్ట, గంగమ్మ అమ్మవారికి వెండి చీరతో అలంకరణ పూర్తయిన వెంటనే అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. తూర్పు వీధి మహాలక్షమ్మ గుడి వద్ద నుండి కాటంరెడ్డి విష్ణుప్రియమ్మ ఆధ్వర్యంలో 1001 కుండలతో మహిళలు పోలేరమ్మకు సద్ది నివేదించేందుకు ఊరేగింపుగా బయలుదేరి పోలేరమ్మ గుడి వద్ద సద్ది నివేదన చేశారు. పోలేరమ్మ గుడి వద్ద పొంగళ్ళు, సలిపిండి, పానకాలు నైవేద్యం పెట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజాస్వామి పోలేరమ్మ అమ్మవారికి బంగారు చీరలు అలంకరించగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం వేళ అల్లూరు ఊరు చివర పోలేరమ్మ చెట్టు వద్ద నుండి పేటసత్రం వరకు విశేష విద్యుత్ దీపాలంకరణతో గ్రామాన్ని అలంకరించారు. సాయంత్రం ముగ్గురమ్మలైన శ్రీ గంగమ్మ, కళుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్లను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అల్లూరులో పుట్టి పెరిగి ఇతర రాష్ట్రాలు, దేశాలలో స్థిరపడిన వారు ముగ్గరమ్మల ఉత్సవానికి రావడం ఆనవాయితి. అల్లూరులో ఇసుకేస్తే రాలనంత భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. హైదరాబాద్ వారిచే గొప్ప మ్యూజికల్ నైట్ ప్రోగ్రాంలో హైదర్ ఆది, సినీ హీరోయిన్‌లతో ప్రత్యేక కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది. రాత్రి గంగమ్మ, కళుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్లను విశేష విద్యుత్ దీపాలంకరణ, పూలంకరణ, మంగళవాయిద్యాలు, బాణాసంచా శబద్దాల మధ్య ఊరేగింపు సాగింది. ముగ్గరమ్మల ఆలయాలు ప్రత్యేక పూలతో అలంకరించడంతో భక్తులు పండుగ ముందే వచ్చిందన్న ఆనందంతో పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. పోలీసులు, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నెల్లూరు జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎ. శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఎస్ఐను కలిసిన ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి



**సీతారామపురం జనవరి 2 ప్రభాతవార్త :** సీతారామపురం ఎస్ఐ పి.అనుషాను మంగళవారం ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల విషయంలో న్యాయంగా బాధ్యతలు నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని ఎంపిపి కోరారు. అందుకు ఎస్ఐ సానుకూలంగా స్పందించి అందరికి న్యాయం జరిగేట్లు చూస్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మండల జెసిఎస్ కన్వీనర్ బాలినేని మాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## దర్గా వక్ఫ్‌బోర్డ్ కార్యాలయంలో ఘనంగా నూతన సంవత్సరవేడుకలు



**అనుమసముద్రంపేట,జనవరి2,ప్రభాతవార్త :** ఏఎస్‌పేట మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీఖాజా రహమతుల్లా నాయబేరసూల్ దర్గా వక్ఫ్‌బోర్డ్ కార్యాలయంలో 2024 నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దర్గా ఉద్యోగుల సంఘం దర్గా ఇఒ. మహ్మద్ హుసేన్‌ను సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కటచేసి సిబ్బందికి పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో దర్గా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అకౌంటెంట్ ఖాజా హుసేన్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిన్నయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మానవ హక్కుల సంఘం రాష్ట్ర సభ్యుడుగా షేక్ జంషీర్



**అల్లూరు, జనవరి 2 ప్రభాతవార్త :** మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అల్లూరు ప్రాంతానికి చెందిన షేక్ జంషీర్‌ను నియమించడం జరిగిందని మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్లు స్యాల్మన్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా జంషీర్ మాట్లాడుతూ మానవ హక్కులు గురించి ప్రజలందరికి అవగాహన కల్పించి వారికి న్యాయం జరిగేందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. రాష్ట్ర స్థాయి కమిటీలో నన్ను నియమించినందుకు కట్టడి ప్యారిస్‌బాబుకు, ఎల్లు స్యాల్మన్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్‌వాడీల సమ్మె ఇతర సంఘాలకు పోరాట స్ఫూర్తి



**కావలి, జనవరి 2 ప్రభాతవార్త :** తమ డిమాండ్లను సాధించుకునేందుకు అంగన్‌వాడీలు, హెల్పర్లు 22 రోజులుగా చేస్తున్న సమ్మె ఇతర సంఘాలకు పోరాటస్పూర్తినిస్తోందని ఐయంఎ గౌరవాధ్యక్షులు, జనవిజ్ఞాన వేదిక నేత, వివిధ సంఘాల బాధ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. కావలి ఆర్డీవో కార్యాలయం ఎదురుగా చేపట్టిన రిలేనిరాహారదీక్షలు మంగళవారం నాటికి 9వ రోజుకు చేరాయి. ఈ శిబిరంలో డాక్టర్ బెజవాడతో పాటు జనవిజ్ఞాన వేదిక నేతలు పాల్గొని మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మీ పోరాటం చాలా స్పూర్తినిస్తుందన్నారు. డిమాండ్లు సాధించుకునేంత వరకు వెనుకడుగు వేయకుండా సిఐటియు అండతో పోరాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంతమంది మహిళలు రోడ్లెక్కి న్యాయం కోసం పోరాడుతుంటే పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పొద్దునే లేచి గ్రామాలలో సేవలు అందిస్తున్న ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం మొండివైఖరిని విడనాడాలన్నారు. జనవిజ్ఞాన వేదిక అండగా వుంటుందన్నారు. ఈ శిబిరంలో అంగన్‌వాడీలు బాలాటలు ఆడి అందరిని ఉత్తేజపరిచారు. ప్రజల్ని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు పి.జానకిరాం, హరినారపరెడ్డి, సిఐటియు నేతలు పసుపులేటి పెంచలయ్య, వై.కృష్ణమోహన్, బి.కృష్ణయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, టీచర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నడుముకు మండలు కట్టుకొని ఆకులు తింటూ కార్మికులు నిరసన



**కావలి, జనవరి 2 ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికులు నడుముకు మండలు కట్టుకొని ఆకులు తింటూ వినూత్న రీతిలో నిరసనలు వ్యక్తం చేశారు. కావలి మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన నినాదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఐటియు నేత పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల పట్ల సానుకూలంగా స్పందించాలన్నారు. నాలుగున్నరేళ్లుగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. డైలీ కార్మికులను ఔట్‌సోర్సింగ్‌లో చేర్చాలన్నారు. గ్రాట్యుటి, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలన్నారు. 62 సంవత్సరాల వయసు పెంపు, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. ఆప్కాస్ నుంచి మినహాయించాలన్నారు. ప్రభుత్వం ఇకనైనా మీనమేషాలు లెక్కపెట్టకుండా సమస్యల్ని పరిష్కరించాలని లేకుంటే ఉద్యమం తీవ్రతరమవుతుందని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో తురక శీనయ్య, బిడదల మహేష్, ఒంగోలు రమేష్, కె.ప్రభాకర్, బాబు, క్రాంతికుమార్, ఎస్.ఆనందరావు, మహిళా నేతలు చిన్నమ్మ, రాజ్యలక్ష్మి, పల్లిపాటి అనిత, కె.రాజేశ్వరి, అనురాధ, నారాయణమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

## అనాధ శవానికి అభయం అంత్యక్రియలు

**కావలి, జనవరి 2 ప్రభాతవార్త :** కావలి అభయం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాధ శవానికి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. కావలి బృందావనం కాలనీ సమీపంలో వేమూరి ఫర్నిచర్స్ ఎదురుగా ఒక అనాధ మృతదేహాన్ని టు టౌన్ ఎస్ఐ గోపీచంద్ గుర్తించి అభయం స్వచ్ఛంద సేవా సంస్థకు సమాచారం ఇచ్చారు. దీంతో అభయం సేవకులు యిలింద్ర మాధవరావు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. అభమం స్వచ్ఛంద సంస్థకు పోలీసులు ధన్యవాదాలు తెలిపారు.

## ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉండే మమ్మల్ని ఆశీర్వదించండి



**దుత్తలూరు,జనవరి2,ప్రభాతవార్త :** మండలకేంద్రమైన దుత్తలూరు బీసీ కాలనీలో ప్రజా ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కాలనీ ప్రజలతో మీకు అందరికీ దగ్గరలోనే ఉంటూ మీ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. జగనన్నతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమవుతాయని తెలగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల వేల కల్లబొల్లి హామీలతో మీ ముందుకు వస్తున్న టక్కరిబాబూ దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌ని నమ్మవద్దని, ఒక పెద్దాయన 40సంవత్సరాలు ఇండస్ట్రీ అంటాడు, కానీ చేసిందేమీ లేదని, ఒకసారి మీరే ఆలోచించండి మంచి జరిగితే మళ్ళీ గెలిపించండి అని చెప్పే జగన్న ఎక్కడ గుంపుగా వచ్చే ఈ దోపిడీ ముఠీ ఎక్కడ మీరే ఆలోచించండి అని తెలియజేశారు. ఈ సందర్భంగా కాలనీలోని మహిళలు తమ కాలనీలో నీటి సమస్య ఎక్కువగా ఉందని నీరు రాక చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మేకపాటి మీ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని చెప్పడంతో, ఆనందంత మేకపాటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దంతరెడ్డి జైసింహారెడ్డి, మండల జేసిఎస్ కన్వీనర్ అన్నంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గంగాధర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ చుండి చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి.



**కొడవలూరు జనవరి 2 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం, కమ్మపాలెం గ్రామం, యల్లాయపాలెం గ్రామాల రైతు భరోసా కేంద్రంలో యూరియాను రైతులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి సిహెచ్.ఎస్. లక్ష్మీ మాట్లాడుతూ కొడవలూరు మండలంలోని వివిధ అర్బీకేలలోయూరియాను రైతులకు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు పంపిణీ చెయటం జరిగిందని తెలిపారు. లంతేకాక రైతులందరు అవసరమైన ఎరువులను సంబంధిత ఆర్బీకేలలో ముందుగానే ఇండెంట్ ప్లేస్ చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరైతు ఎరువులను సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాల సహాయకులు సుజిత, ఉమామహేష్ మరియు రైతులు పాల్గొన్నారు.

## చెన్ను బాలకృష్ణా రెడ్డి లేని లోటు తీరుస్తాం..కార్యకర్తలకు అండగా వుంటాం



**రాపూరు,జనవరి02ప్రభాతవార్త :** దివంగత రాపూరు యంపీపీ చెన్ను బాలకృష్ణా రెడ్డి గారి లేని లోటును నాయకులకు తాము అండగా వుండి సమస్యలనుపరిష్కరిస్తామని జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి తెలిపారు. మంగళవారం తానంచర్ల గ్రామంలోని చెన్ను గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన చెన్ను అభిమానులను, నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ తన బావగారైన చెన్ను బాలకృష్ణా రెడ్డి మీద అభిమానంతో తమవెంట అనేక మంది నాయకులు తమ వెంట నడుస్తున్నారని వారందరికి తన ధన్యవాధాలు తెలిపారు. చెన్ను బాలకృష్ణా రెడ్డి వర్గంలొ వున్న నాయకులకు అనేక ఇబ్బందులు కల్పిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. తాము వైసిపిలోనే కోనసాగుతున్నామని, తమ వర్గానికి జరుగుతున్న అన్యాయానికి ఎవిదమైన న్యాయం చేయాలో పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎది ఎమైనప్పటికి తమని నమ్ముకుని వున్న నాయకులకు తాము ఎప్పుడూ అండగావుంటామని వారు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ రోజు నాయకులందరిని కలుసుకోవడంఅనందంగా వుందని, అందరికి ధనుంజయ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, రాపూరు సోసైటీ మాజీ ఆధ్యక్షుడుచెన్ను బాస్కర రెడ్డి, జిల్లా ప్రజాపరిషత్ వైస్ ఛైర్మన్ చిగురుపాటి ప్రసన్న, రాపూరు యంపీపీ కుమ్మరిగుంట ప్రసన్న, నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, పలువురు యంపీటీసిలు, పలువరు సర్పంచ్‌లుచెన్ను అభిమానులు వున్నారు.

## జగనన్న సురక్ష ఫేజ్-2 కార్యక్రమాన్ని నిర్వహించిన మండల అధికారులు



**ఉదయగిరి,జనవరి2,ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని వెంగలరావునగర్‌లో జగనన్న సురక్ష ఫేజ్-2 కార్యక్రమంలో ఎంపిడివో డి.ఈశ్వరమ్మ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదప్రజల కోసం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ఎంతగానో ప్రజలకు ఉపయోగపడిందని ఆ కార్యక్రమాన్ని ప్రజలందరూ ఉపయోగించుకుని ఆరోగ్యమైన జీవితాన్ని పొందారని తెలిపారు. మరళా రెండో విడతగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని వెంగలరావునగర్, గండిపాలెం గ్రామాలకు సంబంధించిన ప్రజలు వచ్చి తమ దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన చెకప్‌లను ఉచితంగా వైద్యుల పర్యవేక్షణలో పరీక్షించుకుని అందుకు తగిన నాణ్యమైన మందులను, డాక్టర్ల సలహాలను పొందారని ఆమె తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సూచనల మేరకు ఉదయగిరి మండలంలో మొట్టమెదటి సురక్ష-2 కార్యక్రమాన్ని వెంగలరావునగర్‌లో జరిపించామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివకల్పనారెడ్డి, వినితి, పంచాయతీకార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, విఆర్‌వో బి. వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లుతిరుపతి, గొల్లపల్లి కల్పన, ఈ వోపిఆర్డి మల్లికార్జున, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీరు విడుదలపై రైతులకు అవగాహన



**చేజర్ల జనవరి 2 ప్రభాతవార్త :** మండలంలోని నాగులవెలటూరు రైతు భరోసా కేంద్రంలో సాగునీటి విడుదలపై ఇరిగేషన్, వ్యవసాయశాఖ సంయుక్తంగా రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏఒ శశిదర్ మాట్లాడుతు ఆరుతడి పంటలకు సాగునీరు విడుదల చేశారని నీటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని తెలియజేశారు. అలాగే జనవరి 15 వ తేది లోపు నాట్లు పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు ఇకపై నార్లు పోయవద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం వాహనం ద్వారా ఇంటింటికి సరఫరా



**ఉదయగిరి,జనవరి2,ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పరిధిలోని గ్రామాలలో రేషన్ బియ్యాన్ని ఇంటింటికి సరఫరా చేసే విధంగా మండల అధికారులు చర్యలు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో గత కొన్ని నెలల నుండి రేషన్ బియ్యం వాహనం రాక పలువురు ఇబ్బంది పడుతున్న సమస్యలను నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకుని పోగా ఆయన తగిన చర్యలు చేపట్టవలసిందింగా అధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో తహశీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి రేషన్ వాహన డ్రైవర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కరించి లబ్ధిదారుల ఇంటికే బియ్యం అందించే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. షేక్.రియాజ్ ఆధ్వర్యంలో గండిపాలెంలో ఇంటింటికి వాహనం ద్వారా బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గండిపాలెం సర్పంచ్ గొల్లపల్లి కల్పన, వాలంటీర్ వరలక్ష్యయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాకర్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు



**వరికుంటపాడు,జనవరి 2,ప్రభాతవార్త :** కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరోగ్య సంజీవని ద్వారా మండలంలోని జడదేవి గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. గత ఎన్నో రోజులుగా ఉదయగిరి నియోజకవర్గంలో ఆరోగ్యరథం ద్వారా ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ చేస్తున్న సేవలలో భాగంగా మండలంలోని జడదేవి గ్రామంలో 160 మంది రోగులకు వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. తమ గ్రామంలోకి వచ్చి ఉచితంగా వైద్య సేవలు నిర్వహించిన కాకర్ల ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో స్థానిక నాయకులు గోపి, గుర్రం, కామెపల్లి శ్రీనివాసులు, ఏనుగంటి చిన్నకొండయ్య, మక్కిన వెంకటరత్నం, గుర్రం పుల్లయ్య, కర్నాటి నాగయ్య, కుందూరు చినవెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడికి తరలిరాండి

**వరికుంటపాడు,జనవరి 2,ప్రభాతవార్త :** తమ సమస్యల పరిష్కారం కోసం 22 రోజలుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న తమను పట్టించుకోక పోగా ,విధులకు హాజరుకావాలంటూ ప్రభుత్వం హూకుం జారీ చేయడం దారుణమని, అందుకోసం అంగనవాడీ వర్కర్ ల యూనియన్, సిఐటియూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చామనీ, అందుకు మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది తరలిరావాలని సీఐటియూ జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ, కార్యదర్శి రెహానాభేగం లు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక తాహశీల్ధార్ కార్యాలయం వద్ద యూనియన్ నాయకురాలు షేక్ రజీయా ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్‌వాడీ వర్కర్ ల నిరసన కార్యాక్రమములో జిల్లా కమీటి సభ్యులు పాల్గొని, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించకుండా 5 వ తేది నుండి విధులకు హాజరుకావాలనీ లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామనీ అంగన్‌వాడీల సిబ్బందిని బెదిరించడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వం తీరుకు వ్యతిరేఖంగా బుధవారం కలెక్టరేట్ ను ముట్టడించడం జరుగుతుందని, అప్పటికి ప్రభుత్వం దిగిరాక పోతే ఆమరణ దీక్ష కు పూనుకొంటామనీ వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమములో సీఐటియూ మండల అధ్యక్షులు మట్టే హరినారాయణ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ముస్లిం నాయకులు



**అనుమసముద్రంపేట ,జనవరి2,ప్రభాతవార్త :** ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డిని మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ని ఆయన స్వగృహంలో ఏఎస్‌పేట సర్పంచ్ భర్త, మండల మైనార్టీ నాయకులు షేక్ జిలానీబాషా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరున శుభాభినందనలు తెలిపారు. వైఎస్‌సిపికి ముస్లింలే ప్రధాన వెన్నెముకన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్‌ఆర్ పార్టీని గెలిపించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు షేక్ షబ్బీర్‌బాషా, చల్లా హరికృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు షేక్‌రషీద్, రహమత్ నవాజ్, షకీల్‌అహ్మద్, సచివాలయ కన్వీనర్ వసీం, వైసిపి జిల్లా విద్యార్థివిభాగం జనరల్ సెక్రటరీ పఠాన్ నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

## టికెట్లు బహిరంగగా ప్రకటిస్తారు



**నెల్లూరువైద్యం, జనవరి 2, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీలో ఎవరికైనా సీటు ఇచ్చేది ఇవ్వనది చంద్రబాబునాయుడు బహిరంగంగానే ప్రకటిస్తాడని దాని గురించి అనిల్ మాట్లాడటం హాస్యాస్పందంగా ఉందని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఫస్ట్ టైం ఎమ్మెల్యే అనిల్‌పై నారాయణ సెటైర్లు పవన్ కళ్యాణ్ చెవిలో చెప్పాడా.. కలలో వచ్చి చెప్పాడా.. బాబు షూరిటీ – భవవిష్యత్ గ్యారంటీలో మాజీ మంత్రి పొంగూరు నారాయణ 51వ డివిజన్‌లో బాబు షూరిటీ–భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో నారాయణ పాల్గొన్నారు. టికెట్ల విషయాన్ని జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడులే నిర్ణయిస్తారని తెలిపారు. ఆ విషయాన్ని వారు బహిరంగంగానే చెబుతారన్నారు. అసలు మా టికెట్ల విషయాన్ని పక్క పార్టీలు మాట్లాడాల్సిన అవసరం ఏమిటని ఎమ్మెల్యే హితవు పలికారు. నియంతృత్వ పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ఇక మూడు నెలలు సమయం మాత్రమే ఉందని మాజీ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 51వ డివిజన్ కపాడిపాలెంలో మంగళవారం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. డివిజన్‌కు విచ్చేసిన నారాయణకు ప్రజలు, టీడీపీ శ్రణులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. బాబుషూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమ లక్ష్యాన్ని తెలియజేస్తూ రానున్న టీడీపీ ప్రభుత్వ పాలనలో చేపట్టనున్న ప్రజారంజకపాలన, మేనిఫెస్టో వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం తెలుగుదేశం ప్రభుత్వంలో పలు అభివృద్ధి పథకాలు మొదలుపెట్టి 95 శాతం పైగా పనులు పూర్తి చేసిందన్నారు. అనంతరం ఎన్నికలు రావడం, పాలన మారడంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగతా ఐదు శాతం పనులను పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవ చేశారు. ఎక్కడ పూర్తి చేస్తే టీడీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందోనని వైసీపీ ప్రభుత్వం ఆ పథకాలన్నింటిని గాలికొదిలేసిందని దుయ్యబట్టారు. అందులో బభాగంగా నెల్లూరులో అత్యాధునిక వసతులతో 43వేల ఇళ్లు కట్టించడంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తే మిగిలిన పనులు పూర్తి చేసి లబ్దిదారులకు ఇవ్వకుండా ఆ ఇళ్లను దుమ్ము దూళికి వదిలేయడం సిగ్గుచేటన్నారు. ప్రజాధారణతో రానున్న టీడీపీ ప్రభుత్వ పాలనలో నెల్లూరులో మొదటగా తాము చేసే పని పేదలందరికి టీడీపీ హయాంలో కట్టిన ఇళ్లను వెంటనే పంపిణీ చేయడమేనని అన్నారు. పెన్నా నది పక్కన 5700 ఇళ్లను నిర్మించి నారా చంద్రబాబునాయుడు చేత ఓపెన్ చేయించి కోటి రూపాయల వ్యయంతో జిమ్, ఆదునిక వసతులతో పార్కును నిర్మిస్తే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో అవి మనుగడ లేకుండా పోయాయని మండిపడ్డారు. చెత్తతో సంపద సృష్టించి ప్రపంచ దేశాలకే చంద్రబాబు పరిపాలన ఆదర్శనీయంగా నిలిచిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల బ్లాక్ స్పాట్‌స్‌ను గుర్తించి ప్రజా శ్రేయస్సు కోసం నిరంతర శ్రమంతో వాటన్నింటిని గ్రీన్ స్పాట్స్‌గా మార్చామన్నారు. 13 జిల్లాల్లో చెత్త నుంచి కరెంటును ఉత్పత్తి చేసే విధానానికి శ్రీకారం చుట్టిన ఘనత చంద్రబాబు నాయుడు పరిపాలనకే దక్కుతుందన్నారు. టీడీపీ పాలనలో పరిశుభ్రతకు అంత ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. అయితే ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెఇడ్డికి పాలన చేత కాక రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారని, అప్పులమయంగా మారిపోయిందని మండిపడ్డారు. వైసీపీ అరాచకాలను ఇంటింటా తెలియజేసి వారికి విముక్తి కలిగించేందుకు ప్రజాధరణతో రానున్న ఎన్నికల్లో ఖచ్చితంగా టీడీపీ విజయబావుటా ఎగురవేసి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజలకు సుపరిపాలన అందిస్తామని నారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు షేక్ కరిముల్లా, 51వ డివిజన్ ఇన్‌ఛార్జి ప్రశాంత్, యూనిట్ ఇన్‌ఛార్జి ప్రదీప్, వాసు, అధ్యక్షులు ప్రశాంత్, ఆరో కిషోర్, బూత్ కన్వీనర్లు, బీఎల్‌ఓలు టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కాకాణిని మర్యాదపూర్వకంగా కలిసిన విద్యుత్

### ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ శివయ్య



**నెల్లూరు సిటీ, జనవరి 2, ప్రభాతవార్త** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వారి నివా సంలో వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సెక్రటరీ జీవీ శివయ్య మర్యాదపూ ర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ వేగవంతం చేయాలి



**నెల్లూరు, జనవరి 2, ప్రభాతవార్త** బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఉదయం 8గంటల నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో డివిజన్ల వారీగా ప్రతి డివిజన్ టీడీపీ నాయకులతో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సాయంత్రం వరకు ఈ కార్యక్రమం డివిజన్ల వారీగా నిరాటకంగా కొనసాగింది. ప్రధానంగా బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని రాబోయే 10 రోజుల్లో ఎలా వేగవంతం చేయాలి అన్ని విషయాన్ని ఈ సమావేశాల్లో ఆయన చర్చించారు.

## జనసేన రాష్ట్ర నాయకులు అజయ్‌కుమార్‌ని సత్కరించిన అళహరి సుధాకర్



**కావలి రూరల్, జనవరి 2 ప్రభాతవార్త** జనసేన పార్టీ జాతీయ మీడియా కోఆర్డినేటర్, కాంఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ హెడ్ అజయ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో మంగళవారం కావలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ కలిసి దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు విషయాలపై వారు చర్చించుకున్నారు. కావలి పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి అజయ్‌కుమార్‌ని ఆహ్వానించడం జరిగిందని తప్పకుండా వస్తానని ఆయన హామీ ఇచ్చారని అళహరి తెలిపారు. కావలితో అజయ్ కుమార్‌కు వున్న సంబంధాలను, పరిచయాలను గు రించి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కావలి నియోజకవర్గంలో రానున్న ఎన్నికలలో జనసేనకు విజ యావకాశాలు మెండుగా వున్నాయని అజయ్‌కుమార్ వద్ద వున్న వివరాలను బట్టి తెలియజేయడం జరిగిందని తెలిపారు.

## పోలేరమ్మకు స్వచ్ఛందంగా కచేరి నిర్వహించిన తాళ్ళపాళెం



**కావలి రూరల్, జనవరి 2 ప్రభాతవార్త** కావలి పట్టణం పాతవూరులో వెలిసియున్న శ్రీ నడివీధి పోలేరమ్మ ఆలయం వద్ద త్వరలో జరగబోయే జాతర సందర్భంగా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలయ కమిటీ సహకారంతో 2024 సంవత్సరం మొదటి మంగళవారం కావడంతో కావలి సత్యం బ్యాండ్ మేళం బృందం మాస్టర్ తాళ్ళపాళెం సత్యనారాయణ ఆధ్వర్యంలో నడివీధి పోలేరమ్మకు స్వచ్ఛందంగా కచేరి నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్ళపాళెం సత్యనారాయణను, వారి బృందాన్ని కమిటీ సభ్యులు, భక్తులు అభినందించారు. గత పోలేరమ్మ జాతరకు కూడా సత్యం సూపర్ బ్యాండ్ మేళం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు స్వచ్ఛందంగా కచేరి నిర్వహించడం జరిగిందని కమిటీ సభ్యులు గుర్తు చేసుకున్నారు. అమ్మవారికి జరిగిన సద్ది కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విఎస్‌యు క్రికెట్ ట్రోఫీని గెలుచుకున్న జవహర్ భారతి జట్టు



**కావలి రూరల్, జనవరి 2 ప్రభాతవార్త** విక్రమ సింహపురి యూనివర్శిటీ కావలిలో జరిగిన క్రికెట్ జోన్ టోర్నమెంట్‌లో కావలి జవహర్ భారతి కళాశాల జట్టు ట్రోఫీని కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కావలి జవహర్ భారతి కళాశాల జట్టు, విక్రమ సింహపురి యూనివర్శిటీ కావలి జట్టు తలపడ్డాయి. కావలి జవహర్ భారతి జట్టు విన్నర్స్‌గా, విక్రమ సింహపురి యూనివర్శిటీ కావలి జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఈ ట్రోఫీని విక్రమ సింహపురి యూనివర్శిటీ కావలి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చిలకమూరు శ్రీనివాసరావు, టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, ఫిజికల్ డైరెక్టర్ మణికంఠ, భాస్కరరావు, ఏడుకొండలు, శ్రీకాంత్‌లు అందజేశారు.

## పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి



**కోవూరు, జనవరి 2 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే 5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీని 25 లక్షలకు పెంచేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు మండలం చెర్లోపాలెం గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేవలం మన రాష్ట్రంలో మాత్రమే ఆరోగ్యశ్రీ కార్డును 25 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజల ముంగిటికే వైద్యసేవలు అందించేలా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రతి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అనారోగ్యంతో బాధ పడుతున్న వారింటికి వైద్యులే వచ్చి వైద్యసేవలు అందించేలా దృష్టి పెట్టారన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్య, వైద్యం బాగున్నప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందనే దృఢ సంకల్పంతో రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా ముఖ్యమంత్రి వీటి పట్ల ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ నిరంజన్, ఈవోపీఆర్డీలు పలు సూచనలు చేశారు. అనంతరం కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి వైఎస్సార్ కంటి వెలుగు కింద వచ్చిన కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కె. సుశీల, డాక్టర్ వి. ప్రదీప్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, సీహెచ్‌వో కె. సరసమ్మ, పీహెచ్ఎన్ కె. కృష్ణమ్మ, ఎంపీహెచ్ఎస్ ఇలియాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జనవరి 2 ప్రభాతవార్త :** కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలో కోవూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను తప్పక వేయించుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమౌర్య తెలిపారు. కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ టీకాలు వేసుకోవడం వలన పశువుకు అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఈ సీజన్‌లో వచ్చే పలు అంటు వ్యాధులకు ఈ టీకాయే మహా అస్త్రంగా పనిచేస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పశు సహాయకులు ఈ కార్యక్రమాన్ని సమిష్టిగా విజయవంతం చేయాలన్నారు. మంగళవారం కోవూరులో 85 పశువులకు , వేగూరులో 45, లేగుంటపాడులో 46, దండిగుంటలో 47 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు.

## ఆరోగ్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంచాలి



**కోవూరు, జనవరి 2 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మంచి వైద్యం అందాలనే ఉద్దేశంతో ప్రస్తుతం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై గ్రామీణ ప్రాంత ప్రజల్లో మరింత అవగాహన పెంచేలా దృష్టి పెట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. కోవూరు మండలం చెర్లో పాలెం గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా, వలంటీర్ల సమన్వయంతో ఈ సేవలపై వారి వారి పరిధిలోని ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

## ఎరువుల వాడకంలో రైతులు మెళుకువలు పాటించాలి



**కోవూరు, జనవరి 2 ప్రభాతవార్త :** జిల్లాలో ఈ రబీ సీజన్‌లో మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు 1.50 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు రైతులు సాగు చేస్తున్నారని, దీనికి సంబంధించిపదివేలు మెట్రిక్ టన్నులు ఎరువులు ఈ సీజన్‌కు అవసరమని అంచనా వేసి ఇండెంట్ కూడా పెట్టడం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు రైల్వే యార్డ్‌లో మంగళవారం ఆర్‌బీకేలకు పంపేందుకు సిద్ధంగా ఉన్న లారీ లోడ్‌లను ఆమె పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 49వేలు మెట్రిక్ టన్నుల ఎరువులు రావడం జరిగిందని, మరో 3 నెలల్లో 51వేలు మెట్రిక్ టన్నులు వచ్చేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ఈ వారంలోగా మరో 10వేలు మెట్రిక్ టన్నులు రానున్నాయన్నారు. పడుగుపాడు రైల్వే యార్డ్‌లో రేక్ ఇన్‌చార్జిగా సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాతను నియమించడం జరిగిందన్నారు. రైతులకు ఈ సీజన్‌లో కావాల్సి న ఎరువులను అందించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందన్నారు. ప్రధానంగా డెల్టా ప్రాంతమైన కోవూరు వేలుఎరువులను సంబంధిత రైతుభరోసా కేంద్రాలకు పంపడం జరిగిందన్నారు. ఆర్‌బీకేలను ప్రైవేట్ డిపోల్లోనూ అమ్మకాలు సాగిస్తున్న వారు తప్పనిసరిగా ఏ రోజు అమ్మ కాలను ఆ రోజే ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో పడుగు పాడు యార్డ్‌లో రేక్‌లో ఏర్పడిన పలు సమస్యల కారణంగా ఎరువుల రవాణా కొంతమేర అంతరాయం కలిగిందన్నారు. ఈ రబీ సీజన్‌లో రైతులు యూరియా ఎక్కువగా వాడడం వలన చీడపురుగుల ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సిఫార్సు చేసిన మోతాదులో సమపాళ్లలో ఎరువులు వాడుకోవాలన్నారు. జిల్లాలోని 39 మండలాల్లో ఉన్న వ్యవసాయాధికారులు వారి వారి పరిధిలో ఉన్న ఆర్‌బీకేలు ప్రైవేట్ ఎరువుల డిపోలను క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో పలు చోట్ల జింక్ లోపం కానవస్తుందని, దీని నివారణకు గానూ జింక్ సల్ఫేట్ ఒక గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. కౌలు రైతులకు ఎవరైనా బ్యాంక్ రుణాలు కావాలంటే ఆయా గ్రామాల్లోని మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా రైతులు ఈ సీజన్‌కు సం బంధించి ఈ క్రాప్ నమోదుకు వ్యవసాయ సహాయకులకు సహకరించాలని ఈ సందర్భంగా ఆమె పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలోసహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత సహాయ వ్యవసాయ సంచాలకులు సర్వోజీరావు, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, వీఏవోలు ఉన్నారు.

## నేటి నుంచి సచివాలయ స్థాయి క్రికెట్ పోటీలు



**కోవూరు, జనవరి 2 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో బుధవారం నుంచి సచివాలయ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు కొత్తూరులోని కేఎస్ఎన్ కళాశాల క్రీడా మైదానాన్ని, నేతాజీ నగర్‌లో ఉన్న క్రీడా మైదానాన్ని నిశితంగా పరిశీలించారు. వీటితో పాటు వేగూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కూడా క్రికెట్ పోటీలను నిర్వహించేందుకు దానికి సంబంధించిన గ్రౌండ్‌లను కూడా సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ పరిశీలనలో మండల విద్యాశాఖ అధికారి-2 వై. చెంచులక్ష్మమ్మ, ఫిజికల్ డైరెక్టర్లు మధుసూదన్‌రావు, రమేష్‌బాబు, దేవిక, దెలీలా, పీఈటీలు వెంకటసుబ్బమ్మ, సాయితేజ, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉంది



కోవూరు, జనవరి 2 ప్రభాతవార్త : ఎన్నికలకు ముందు అక్కచెల్లెమ్మలు అన్న ముఖ్యమంత్రి అంగన్‌వాడీల పోరాటాలను కించపరిచే విధంగా ఆదేశాలు ఇవ్వడం ఆయన నిరంకుశ పాలనకు నిదర్శనమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు విజయ్‌కుమార్ తెలిపారు. కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టు వదలకుండా అంగన్‌వాడీలు పండుగ రోజుల్లో సైతం ఇన్ని రోజులుగా జరపడం చరిత్రలోనే నిలిచిపోతుందన్నారు. ఒకవైపు ప్రభుత్వం కుట్రలతో ఉద్యమాన్ని అణచివేయాలని రకరకాల ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లపై స్పందించాలన్నారు. ఒకవేళ ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తే ఈ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శేషయ్య, సుబ్బారావు, అఫ్రోజ్, అంగన్‌వాడీలు నాయకులు విజయమ్మ, శేషమ్మ, సుభాషిణి ఉన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తులు తారసపడితే ఫిర్యాదు చేయండి

**కావలి, జనవరి 2 ప్రభాతవార్త** కావలి పట్టణంలో, పలు వీధులలో గుర్తు తెలియని వ్యక్తులు తారసపడితే వెంటనే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేయాలని కావలి ఒకటవ పట్టణ నూతన సిఐ రాజేష్ తెలిపారు. ఆయన రూరల్ స్టేషన్ నుంచి కావలి వన్‌టౌన్ సిఐగా బదిలీ అయి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు పోలీసులకు సహకరించి నేరప్రవృత్తికి అడ్డుకట్ట వేయవచ్చున్నారు. అలాగే ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి వా హనాలు నడపాలన్నారు. దీనివల్ల ప్రమా దాలను అరికట్టవచ్చున్నారు. అతివేగం మహా ప్రమాదమన్నారు.

**వేలం ప్రకటన**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సైదాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని PWS చెరువు మరియు తిమ్మసముద్రం సంబంధించిన చెరువులో చేపలు పెంచుటకు వేలం పాటలు తేది 05.01.2024 శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుంది. కావున పాట దారులు 10,000/- డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలి. పాట పూర్తి అయిన తరువాత పాటలో సగం చెల్లించాలి.

ఇట్లు : శశిఇంద్రాణి
పంచాయతీ కార్యదర్శి,
గ్రామ పంచాయతీ, సైదాపురం

## వైఎస్సార్ పెన్షన్ కానుక ప్రారంభం

**సైదాపురం, జనవరి 2, ప్రభాతవార్త** జనవరి 3వ తేదీ నుండి 8వ తేదీ వరకు సైదాపురం మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 2750 నుంచి రూ. 3వేల వరకు పెన్షన్ పెంచిన నేపధ్యంలో కొత్తగా మంజూరైన పెన్షన్‌లతో కలిపి మండలంలో 7372 పెన్షన్‌లను అవ్వాతాతలకు స్థానిక సచివాలయం గ్రామ వాలంటీర్ల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

**NOTICE TO PUBLIC**

As per the instructions of my client Sri Kota Venkateswarlu S/o.Late Subbarayudu, aged 73 years resident of Door No.11-32-45, Plot No.19, Brundavanam Colony. Kavali - 524201, SPSR Nellore District, Andhra Pradesh that:

The Original Registered Title Deeds under which my clint's family members i.e. Son, Daughters, Son-in- laws, Daughter-in- laws purchased the properties kept with him since long back, as he being elder of the family. While so on 20.12.2023 my clint kept all the original title deeds mentioned hereunder in a bag for taking Xerox copies, boarded Auto at his house and reached Xerox centre in Trunk Road near Vegetable Market, Kavali - 524201, AP and found that he lost the bag.

Registered Sale Deeds stands in the name of my son-in-law N.Sathish Kumar registered at Joint -2 Kancheepuram Sub Registrar Office
(1) Dt. 23.12.2011 Doc No.10025/2011. (2) Dt.31.12.2012 Doc.No.8431/2012.
(3) Date 18.03.2013 Doc.No.1661/2013. (4) Dt.04.07.2013 Doc.No.4080/2013.
(5) Dt.04.07.2013 Doc.No.4086/2013 (6) Dt. 26.08.2013 Doc.No.5216/2013.
registered at Ponneri Sub Registrar Office
(7) Dt.25.11.2011 Doc.No.14516/2011. (8) Dt.25.11.2011 Doc.No.14517/2011
registered at Tiruttani Sub Registrar Office
(9) Dt.27.04.2008 Doc.No.2457/2008
registered at Thiruvelangadu, Sub Registrar Offide
(10) General Power of Attorney Deed Dt. 26.09.2007 Doc.No.717/2007
(11) Regd. Sale Deed of Sub Registrar Office, R.K.Pet, T.N. in the name of my second son-in-law K.V.V.Vara Prasad Dt. 17.07.2009 Doc.No. 2523/2009.
(12) Regd. Sale Deed of Sub Registrar Office, Ponneri T.N. in the name of my son Kota Venkata Jagan Mohan Rao Dt.04.07.2011 Doc.No.7457/2011.
(13) Regd. Sale Deed of Sub Registrar Office, Tiruttani, T.N. in the name of my daughter-in-law K.Kanchana Dt.07.03.2000 Doc.No.525/2000 And
(14) Dt.30.03.2000 Doc.No.836/2000. (15) Regd. Sale Deed of Sub Registrar Office, Gudur, SPSR Nellore District, in the name of my daughter N.Jhansi Rani Dt.13.06.2011 Doc.No.3748/2011 and (16) Dt.17.01.2013 Doc.No.6283/2013

My clint is hereby requesting the public, if anybody found the bag containing the above documents may kindly be informed to the following address:

**P.V.Ramana Reddy**
Advocate & Notary, Kavali - 524201, A.P., **Cell: 9441523764**

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, జనవరి 2 ప్రభాతవార్త :** కోవూ రులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో మార్గశిర మాస మంగళవారం పర్వదినం సందర్భంగా స్వామివారికి ప్రాత: కాలమునే ఆలయ ప్రధాన అర్చకులు నాగ రాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూ జలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం నాగవల్లి పత్రా లతో ప్రత్యేక పూజలను చేపట్టారు. స్వామివారికి పల్లకిసేవ కార్య క్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఉమా మహేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్‌స్వామి, భక్తులు ఉన్నారు.

## నిరంజన్‌బాబు రెడ్డికి అభినందనల వెల్లువ



**కోవూరు, జనవరి 2 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డిని మంగళవారం ఆయన కార్యాలయంలో పలు శాఖల అధికారులు, నేతలు కలిసి పూలమాల శాలువా, బొకేలతో ఘనంగా సత్కరించారు. కోవూరుకు చెందిన సుమధుర నాట్యమండలి వ్యవస్థాపక అధ్యక్షులు, చిత్రలేఖన కళాకారులు షేక్. హుద్దూస్‌బాషా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా కోవూరు సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్సై రంగనాథ్ గౌడ్, సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, మండల వ్యవసాయాధికారి ఇందిరావతి, ఏపీఎం వెంకటస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్, ఏఈ జగదీష్‌బాబు, గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవ్ , ట్రాన్స్‌కో ఏఈ మునిరాజు, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిరంజీవి, అంజన్‌రావులు కలిసి ప్రత్యేకంగా అభినందించారు.

## చెన్ను గార్డెన్స్‌లో యం.సీ పౌండేషన్ క్యాలండెర్ అవిష్కరణ



**రాపూరు, జనవరి 2ప్రభాతవార్త** మండలంలోని తానంచర్ల గ్రామంలో దివంగత రాపూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుని నివాసంలోమంగళవారం యం.సీ పౌండేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. యం.సీపౌండేషన్ వ్యవస్థాపకులు జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, రాపూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు చెన్ను బాస్కర రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్‌వైస్ ఛైర్మన్ చిగురుపాటి ప్రసన్న, రాపూరు యంపీపీ కుమ్మరిగుంట ప్రసన్న, మండల వైసిపి నాయకుడు నల్లవడ్లవెంకటరమణా రెడ్డి, పలు గ్రామ సర్పంచ్‌లు, యంపీటీసిలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులకుచెన్ను అభిమానులకు వారు క్యాలెండర్‌లు, స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగాపలువురు నాయకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డికి, చెన్ను తిరిపాల్ రెడ్డికి శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. మండలం లోని పలు గ్రామాలకు చెందిన చెన్ను బాలకృష్ణా రెడ్డి అభిమానులు, గ్రామ సర్పంచ్‌లు, యంపీటీసిలు పాల్గోన్నారు.

## నేడు రాపూరులో నేదురుమల్లిచే వైఎస్ఆర్ ఫించన్ పంపిణీ



**రాపూరు, జనవరి 2ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులో బుధవారం తిరుపతి జిల్లా వైసిపి ఆధ్యక్షుడు, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ ,వెంకటగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నేదు రుమల్లి రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఫించన్ దారులకు పెంచిన రూ .3000లు వైఎస్స్ ఆర్ ఫించన్‌ను అందించనున్నట్లు రాపూరు మండల వైసిపి కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి తెలిపారు. రాపూరు మం డల ప్రజా పరిషత్ కార్యలయం ఆవరణలో ఏర్పా టు చేసిన సమావేశంలో నేదురుమల్లిరాంకుమార్ రెడ్డి మండలంలోని వైసిపి నాయకులతో కలసి పాల్గోని రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఫించన్‌ను లబ్ధీదారులకు అందిస్తారని దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, యంపీటీసిలు, స్ధానిక సంస్ధల ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

## వైభవంగా ఫక్రుద్దీన్‌బాబా గంథమహోత్సవం



**అనుమసముద్రంపేట ,జనవరి2,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేట లోని ప్రముఖ పురాతన దర్గా హజరత్ సయ్యద్ ఫక్రుద్దీన్‌షావలి ఉరఫ్ ఫక్రుద్దీన్‌బాబా సామివారి గంథమహోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పెద్ద దర్గా సజ్జాదా నషీన్‌ఎస్.జి.ఎస్.హాఫీష్‌పాషా గంథాన్ని సుగంధ ద్రవ్యాలు , అత్తరు , పన్నీరులతో కలిపి గంథ కలశాన్ని దర్గా సజ్జాద సయ్యదర్ ఆరీఫ్ హుసేన్ తనయుడు ఆదిల్ హుసేన్ తలపై ఉంచి మేళతాళాలతో ఫకీర్ల జరూబులతో బాణాసంచా కాలుస్తూ భక్తి కీర్తనల నడుమ స్థానిక ఖాజా నాయబ్ రసూల్ పెద్ద దర్గాకు చేర్చి అక్కడ హజరత్‌వారి సమాధులకు గంథలేపనం చేసి ఫాతిహా చదివారు. అనంతరం అక్కడి నుండి ఊరేగింపుగా గంథం ఫక్రుద్దీన్ బాబా దర్గాకు చేర్చి స్వామివారి సమాధికి గంథ లేపనం చేసి సమాధిపై చద్దర్లు పూలదుప్పట్లు కప్పి ప్రత్యేక సలాములు పాడి ఫాతిహా చదివి దువా చేశారు. అనంతరం భక్తులకు గంథ ప్రసాదాలు పంచిపెట్టారు. గంథమహోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో దర్గా పూజారులు సయ్యద్ మహబూబ్‌బాషా, సయ్యద్ జావీద్‌హుసేన్, నాతీయ గాయకులు షేక్ సందాని బాషా, భక్తులు పాల్గొన్నారు.









## శక్తి వంచన లేకుండా పనిచేయాలి



**నెల్లూరు, జనవరి 2, ప్రభాతవార్త** ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా పనిచేసి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేలా చేయాలని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. చింతా రెడ్డిపాలెంలో ఉన్న నారాయణ మెడికల్ కాలేజీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నగర డివిజన్ల నాయకులు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి మాజీ మంత్రి నారాయణ డివిజన్ స్థాయి నాయకులకు పలు సూచనలు చేశారు. బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ, క్షేత్ర స్థాయిలో ఓటర్ల వెర్ఫికేషన్, రానున్న ఎన్నికల్లో చేపట్టాల్సిన విధివిధానాలపై క్షుణ్ణంగా చర్చించి, దిశానిర్దేశం చేశారు. ఈ సంధ్బంగా మాజీ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు నారా చంద్రబాబు గ్యారంటీ అని చెప్పారు. ప్రజలందరి ఆదరణతో ఖచ్చితంగా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్ట తిరుగులేని విజయం సాధించి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాబోతున్నారని అన్నారు. ఇందుకు ప్రతి కార్యకర్త తమ వంతుగా శక్తి వంచన లేకుండా పనిచేసి టీడీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యాంటీ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తుంటే విశేష స్పందన వస్తుందన్నారు. దీన్ని బట్టి చూస్తే నియంతృత్వ పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత ఏపాటిదో అర్థమవుతుందని తెలిపారు. జగన్ అవగాహనరాహిత్యంతో రాష్ట్రాన్ని దౌర్భాగ్య స్థితిలోకి నెట్టాని, ప్రజలను అష్టకష్టాలు పెడుతున్న వైసీపీ ప్రభుత్వానికి కాలం చెల్లిందని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయో అని ప్రజలే ఎదురుచూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు షేక్ కరిముల్లా, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, నగర అధ్యక్షులు మామిడాల మధు, కాకర్ల తిరుమలనాయుడు, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**ముత్తుకూరు, జనవరి2, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు చంద్రబా బు నాయుడుతోనే ఉంటుందని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముత్తుకూరు మండలంలోని దమాయపాలెం పంచాయతీలోని బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్ర మాన్ని పోతునాడుదిబ్బలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అది ఈ ప్రభు త్వానికి పట్టడంలేదన్నారు. తుఫాను పరిహారంలో బిసిలకు, ఎస్సీలకు అన్యాయం జరిగిందన్నారు. మా ప్రభుత్వ హయాంలో తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పరిహారం ఇచ్చామన్నారు. ఈ ప్రభుత్వంలో వారికి అనుకూలమైన వారికే పరిహారం ఇచ్చారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి పోవాలంటే చంద్రబాబు నాయుడు మరళా ముఖ్య మంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉందన్నా రు. జరగబోయే ఎన్నికల్లో టిడిపి విజయకేతనం ఎగరవేసేందుకు ప్రతి ఒక్కరూకృషి చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో మండల అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ,మునిరెడ్డి మల్లికార్జున యాద వ్,మై నారిటీనాయకులు ఆలిముత్తు ,అక్కయ్యగారి ఏడుకొండలు, బీసీ నా యకులు పల్లికొండ సీనయ్య, శ్యా మ్, స్థాని కనాయకులు నరసారెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.






## ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం



బుచ్చి జనవరి 3 ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తు పేద ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళె మండలం పెనుబల్లి గ్రామంలోని హైస్కూల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్, స్పాట్ సర్వే కౌం టర్, కేస్‌షీట్, ల్యాబ్ టెస్టింగ్‌కౌంటర్స్ ఓపి తదితర ఏర్పాట్లును పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసదుపాయాలు గురించి ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తు ఆరోగ్య భరోసా ఇవ్వడం జరుగుతుందని చెప్పారుజ అందులో భాగంగా ఇప్పటికే జిల్లాలో గత అక్టోబర్ మాసంలో 1వ విడత జగనన్న సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించి వైద్యపరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు కూడా అందజేసిందని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షకార్యక్రమానికి కొనసాగింపుగా జనవరి 2నుండి 2 వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లాకలెక్టర్ తెలిపారు. మన జిల్లాలో 17 గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరుగుతున్నట్లు ఆయన వివరించారు. ప్రజలు వైద్యశిబి రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా అదికారి డాక్టర్ పెంచలయ్య, తహసిల్దారు సుధీర్, జొన్నవాడ పిహెచ్‌సి డాక్టర్ సచివాలయం సిబ్బంది, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ మినగల్లు స్కూల్‌లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అలాగే విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యహ్న బోజనం పథకం కింద ఇస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి గంగా భవానీ, తహసిల్దారు సుధీర్, ఎంపిడిఒ నరసింహారావు, ఎంఇఒ దిలీప్‌కుమార్, పివెంకటతర్నం, సిహెచ్ ఎం.రవీంద్రయ్య, పెనుబల్లి సర్పంచ్ ఓడా పెంచలయ్య, ఎంపిటిసి సభ్యులు చేవూరు వినయ్‌నారాయణ, మినగల్లు సర్పంచ్ పూజిత, సెక్రటరీ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గోన్నారు






## టీడీపీదే అధికారం



**నెల్లూరు, జనవరి 2, ప్రభాతవార్త** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జనసేనల కూటమి అధికారం చేపట్టడం ఉందని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తధ్యమని తెలుగుదేశం పార్టీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం రూరల్ నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్, చింతారెడ్డిపాలెం, రాజుపాలెం, వడ్డిపాలెంకు చెందిన యువకులు, రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రూరల్ నియోజకవర్గంలో వాడవాడలా యువత, మహిళలు, రైతులు పెద్ద ఎత్తున వివిధ వర్గాల వారు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రెండు నెలల తరువాత తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలో చేరిన వారందరికి న్యాయం చేస్తానని శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందిపాటి శ్యామ్, దానా మహేష్, తూమ్మా తనూజ, యేసయ్య, మాలకి, నాని, సనత్, అజిత్, శ్రావణ్, లోకేష్, రూపేష్, రాకేష్, మదన్, డింపుల్, వర్ధన్, ఆదర్శ్, భాస్కర్, శాంసన్, చిన్ను, అభినయ్, ఆనంద్, క్రాంతి, చందు, ప్రవీణ్, సైఫాలీఖాన్, హర్ష, రాజేష్, సేలం, హరీష్, సర్దార్, రాం నారాయణ, శివ, నిఖిల్, ఈశ్వర్, నితిన్, భరత్, ప్రేమ్, చిన్న బాబు, శ్రీకాంత్, అజయ్, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.






## యన్‌జీఓస్ అసోసియేషన్ 2024టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ



**నెల్లూరు అర్బన్, జనవరి 2, ప్రభాతవార్త** ఏపీ యన్‌జీఓస్ అసోసియేషన్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాశాఖ 2024 టేబుల్ క్యాలెండర్‌ను నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆయన ఛాంబర్‌లో మంగళవారం అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్నేపల్లి పెంచలరావు, నాయుడు వెంకటస్వామిల ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు.

ఈకార్యక్రమంలో జిల్లా కోశాధికారి బి.వెంకటేశ్వర్లు, అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.ఆంజనేయ వర్మ, ఆ ర్గనైజింగ్ కార్యదర్శి జి.రామకృష్ణ, ఉపాధ్యక్షులు ఈ.కరు ణ మ్మ, మధు, కృష్ణంరాజు ,కృష్ణ కుమా ర్, సంయుక్త కార్యదర్శులు పెంచలయ్య, విజయకుమర్, సువర్ణ, జిల్లా మహిళా చైర్పర్సన్ చిన్నమ్మ, నెల్లూరు నగర అధ్యక్షులు సీహె చ్ రామకృష్ణ, కార్యదర్శి డి. మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.









## బాలికల కళాశాల హాస్టల్‌ను సందర్శించిన డీబీసీడబ్ల్యూఓ వెంకటయ్య

**నెల్లూరు టౌన్, జనవరి 2, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలోని బాలికల కళాశాల హాస్టల్‌ను మంగళవారం రాత్రి బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి వై.వెంకటయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో రిజిస్టర్ మేరకు సరుకులు ఎంత వరకు ఉన్నాయో పరిశీలించారు. అలాగే బాలికలకు ప్రసూతి గృహంలో అందుతున్న ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించారు. బాలికలకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేయాలని హాస్టల్ సంక్షేమ అధికారికి సూచించారు. అలాగే బయోమెట్రిక్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. బయోమెట్రిక్ ఏం మేరకు నమోదు అవుతుందో ఆయన పరిశీలించారు. బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని అన్ని వసతి గృహాల్లో వేడుకలు నిర్వహించాలని ఆయన సూచించారు. హాస్టల్ నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది.

## ఆరోగ్య సురక్షని విజయవంతం చేయాలి



**నెల్లూరు, జనవరి 2, ప్రభాతవార్త-వైద్యం** రెం డో విడత చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డైరక్టర్ ఆ ఫ్ హెల్త్ విజయవాడ అధికారిణి డాక్టర్ పద్మా వతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్యలు ఆదేశించారు. మంగళవారం నగరంలోని సంతపేటలో ఉన్న డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో పద్మావతి అధ్యక్షతన ఆరోగ్య సురక్ష పై సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదట విడత జిల్లాలో జరిగిన విధానం గురించి పెంచలయ్య డైరక్టర్‌కి వివరించారు. అదే విధంగా రెండో విడత ఆరోగ్య సురక్ష కూడా విజయవంతం చేస్తామని ఆమెకు తెలిపారు. అలాగే కుష్టి వ్యాధి సర్వే కార్యక్రమం పటిష్టంగా అమలు చేయాలని వారు అధికారులను ఆదేశించారు. డాక్టర్ ఖాదర్‌వలి, డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## దువ్వూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



సంగం జనవరి 2 ప్రభాతవార్త సంగం మండలంలో ,దువ్వూరులో జరుగుతున్న ఆరోగ్య సురక్ష 2 విడత కార్యక్రమాన్ని జిల్లాకలెక్టర్ ఎం.హరి నారాయణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్ట్రేషన్ ప్రక్రియ , హెల్ప్‌డెస్క్, స్పాట్ సర్వేకౌం టర్, కేస్ షీట్, ల్యాబ్ టెస్టింగ్‌కౌంటర్స్ ఓపి తదితర ఏర్పాట్లును పరిశీలిం చారు. గ్రామస్తులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసదుపాయాలు గురించి ఆరాతీశారు. వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే సంగంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో తహసిల్దారు నాగరాజు, వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య, వైసిపి నాయకులు కంతాబత్తినరఘునాదరెడ్డి, ఎంపిడిఒ గోపి, విజపిఆర్‌డి రమేష్‌బాబు, డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, వైద్యసిబ్బంది వున్నారు.

## కూచిపూడి నృత్య కళాకారుల్ని అభినందించిన ఎమ్మెల్యే దంపతులు



**కావలి, జనవరి 2 ప్రభాతవార్త** కావలి పట్టణానికి చెందిన శ్రీ మేథ నృత్య కళానిలయం కళాకారుల్ని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు ఘనంగా సత్కరించారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనకు గిన్నీస్ రికార్డు వరించింది. ఈ సందర్భంగా కళానిలయం గురువు కోవూరు సరయి కృష్ణ, ఆమె శిష్యులు గీతిక హాసిని, హనీఫ్, నేహా, దనిక, జాశ్విత, సమన్వి, నిత్య, నైనిక, మోక్తిక, శ్రిజల పేర్లు గిన్నీస్ రికార్డులో నమోదయ్యాయి. దీంతో ఎమ్మెల్యే దంపతులు సరయి కృష్ణని, శిష్య బృందాన్ని ఎమ్మెల్యే నివాసంలో సత్కరించి అభినందించారు.